www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 86 | హైదరాబాద్ | శనివారం | 14-06-2025 | పేజీలు: 04 | వెల 2/-

## రాష్ట్రంలో కొత్తగా 571 పాఠశాలలు ప్రారంభిస్తున్నాం

**హైదరాబాద్ జూన్ 13(సిద్దిపేట పవర్):**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడమే తమ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలని, అందుకు అవసరమైన మౌలిక వసతులు, ఉపాధ్యాయులకు శిక్షణ, ఇతర సదుపాయాల కల్పనకు ఎంత ఖర్చయినా వెనుకాడేది లేదని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో 20 మంది కన్నా ఎక్కువ పిల్లలున్న గ్రామాలు, పట్టణాల్లో ఈ ఏడాది కొత్తగా 571 పాఠశాలలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. బోధనా ప్రమాణాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను సీఎం అధికారులకు సూచించారు.

"విద్యార్థులకు భాషా పరిజ్ఞానంతో పాటు నైపుణ్యాల పెంపునకు వీలుగా విద్యావ్యవస్థను మార్చాలి. హైస్కూల్ స్థాయి నుంచి విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కల్పిస్తే భవిష్యత్తులో వారు తమకు ఇష్టమైన రంగంలో రాణించే అవకాశం ఉంటుంది. రాష్ట్రంలో పట్టణీకరణ వేగంగా సాగుతున్న నేపథ్యంలో విద్యాశాఖ పురపాలక శాఖతో సమన్వయం చేసుకోవాలి. హెచ్ఎండీఏ, మున్సిపల్ లేఅవుట్లలో ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విభాగాల కింద ఇంటర్మీడియట్ వరకు ఉన్న విద్యా సంస్థలను హేతుబద్ధీకరించి ప్రతి పాఠశాలలో నిర్దిష్ట సంఖ్యలో విద్యార్థులు ఉండేలా చూడాలి. నాణ్యమైన భోజనం, యూనిఫాం, పాఠ్య పుస్తకాలు ఇస్తున్నందున విద్యార్థులు



పెద్ద సంఖ్యలో గురుకులాల వైపు మొగ్గు చూపుతున్నారు. డే స్కాలర్లకు కూడా అవన్నీ అందించే విషయంపై అధ్యయనం చేయాలి"అని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, కే.కేశవరావు, సీఎంవో, విద్యా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి సిద్ధమా..?
# కేటీఆర్ సవాల్..

కేటీఆర్ ఘాటు స్పందన

ఏసీబీ నోటీసులపై కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపాటు

ఫార్ములా ఈ నిధులపై వివాదం.. రూ.44 కోట్ల వ్యవహారంపై స్పష్టత కోరిన కేటీఆర్




**హైదరాబాద్ జూన్ 13(సిద్దిపేట పవర్):**

ఫార్ములా ఈ కేసులో ఈ నెల 16న ఉదయం 10 గంటలకు విచారణకు హాజరు కావాలని ఏసీబీ అధికారులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఏసీబీ నోటీసులపై కేటీఆర్ స్పందించారు.

తన పరిపాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, పరిపాలన చేతకాని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నోటీసుల పేరుతో నాటకాలు ఆడుతున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చి, ప్రభుత్వాన్ని నడపడం చేతకాని జోకర్ ముఖ్యమంత్రి ప్రజల దృష్టి మరల్చేందుకు పూటకో వేషం వేస్తున్నాడు.. రోజుకో కుట్ర చేస్తున్నాడనీ, కానీ

...మిగితా2లో

## పురపాలికలను తీవ్రంగా వేధిస్తున్న సిబ్బంది కొరత..

వంద రోజుల ప్రణాళిక సాగేనా!

మున్సిపల్ శాఖలో 121 మందికి ప్రమోషన్లు

45 రోజులైనా ఇవ్వని పోస్టింగ్‌లు



2

## కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు రాజకీయ
# కక్ష సాధింపే



2


## తెలంగాణలో 28 బార్లకు లాటరీ ప్రక్రియ పూర్తి..

జీహెచ్ఎంసీ పరిధిలో అధిక స్పందన

జీహెచ్ఎంసీలో 24 బార్లకు 3,520 దరఖాస్తులు

లాటరీ ద్వారా రూ.36.68 కోట్ల ఆదాయం


అధికంగా విజయం సాధించిన హైదరాబాద్, నల్గొండ అభ్యర్థులు



2

## ప్రమాద స్థలంలో బ్లాక్ బాక్స్ లభ్యం..

- అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాదం
- వందల కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపిన ఘటన
- టేకాఫ్ అయిన కొన్ని క్షణాలకే కుప్పకూలిన విమానం
- తాజాగా ఘటనా స్థలంలో బ్లాక్ బాక్స్ లభ్యం..?




2

## కేటీఆర్‌కు నోటీసులు... తీవ్రంగా స్పందించిన కవిత

- ఇది రాజకీయ కక్ష సాధింపేనని తీవ్ర ఆరోపణ
- ఎన్ని కుట్రలు పన్నినా వెరవబోమని స్పష్టీకరణ
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుంచుతామన్న కవిత



2

## కేంద్రం ఉగ్రవాదులతో కాల్పుల విరమణ చేసుకుంది.. మావోయిస్టులతో చర్చలకు వస్తలేదు..

ఎడ్ల గురువా రెడ్డి14వ వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని..

కేంద్రం ఉగ్రవాదులతో కాల్పుల విరమణ చేసుకుంది.

విమాన ప్రమాదంలో మాజీ సీఎం విజయ్ రూపానీ మరణించడం దురదృష్టకరం: కూనంనేని



2

## నా ఎన్నికల్లో అందరూ కష్టపడ్డారు..

ఖమ్మం జిల్లాలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి తుమ్మల..

నా ఎన్నికల్లో అందరూ కష్టపడి పని చేశారు, రేపు మీ ఎన్నికలు వస్తున్నాయి..

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది: మంత్రి తుమ్మల



2

# రేవంత్ రెడ్డి సిద్ధమా..? కేటీఆర్ సవాల్..

మొదటిపేజీ తరువాయి

ఈ చిల్లర చేష్టలు, పనికిరాని డ్రామాలతో ప్రతినిత్యం తెలంగాణ ప్రజల గొంతుకై పోరాడుతున్న మమ్మల్ని అడ్డుకోలేరని ఈ దద్దమ్మ సీఎం, ఈ వైఫల్యాల కాంగ్రెస్ సర్కారు గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు.

ఫార్ములా ఈ రేసు నిర్వహణ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం హెచ్ఎండిఏ అధికారిక బ్యాంకు ఖాతా నుంచి పారదర్శకంగా, సాధికారికంగా పంపిన రూ. 44 కోట్లు ఇప్పటికీ ఫార్ములా ఈ సంస్థ అకౌంట్ లోనే ఉన్నా, వాటిని వెనక్కి రప్పించడం చేతకాని ముఖ్యమంత్రి మరోసారి ఏసీబీ నోటీసులు తనకు ఈరోజు పంపించాడని కేటీఆర్ తెలియజేశారు. హైదరాబాద్ నగరానికి తెలంగాణకు ఎంతగానో పేరు తీసుకువచ్చిన ఫార్ములా ఈ రేసును అర్ధాంతరంగా రాజకీయ దురుద్దేశంతో రద్దు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఫార్ములా ఈ సంస్థ వద్ద ఉన్న రూ. 44 కోట్లు ప్రజాధనాన్ని వెనక్కి తీసుకువచ్చే ప్రయత్నం ఉద్దేశాపూర్వకంగా పక్కనపెట్టి, నోటీసుల పేరుతో ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకునేందుకు కుట్ర చేశారన్నారు. తనకు ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చిన, విచారణ పేరుతో సాగదీసినా ఫార్ములా ఈ అంశం సంపూర్ణ పారదర్శకంగా జరిగిందని, ఈ విషయం అందరికీ తెలుసు అని కేటీఆర్ అన్నారు.

ఈరోజు తాజాగా మరోసారి ఇదే అంశంలో ఏసీబీ తనకు నోటీసు ఇచ్చిందని తెలిపిన కేటీఆర్, చట్టాలను గౌరవించే పౌరుడిగా, తప్పకుండా సోమవారం ఉదయం 10 గంటలకు ఏసీబీ విచారణకు హాజరవడంతోపాటు.. విచారణకు అన్నివిధాలుగా సహకరిస్తానన్నారు. అయితే, పదేళ్ల క్రితం నోటుకు ఓటు కుంభకోణంలో నోట్లకట్టలున్న నల్లబ్యాగుతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ రేవంత్ రెడ్డి కేసు కూడా ఇదే ఏసీబీ పరిధిలో పెండింగ్ లో ఉందన్న విషయం గుర్తు చేసిన కేటీఆర్, ఇద్దరిపై కూడా ఏసీబీ కేసులున్న నేపథ్యంలో.. ఇద్దరిలో దోషులెవరో, నిర్దోషులెవరో తేల్చేందుకు జడ్జి గారి సమక్షంలో లైవ్ టెలివిజన్ సాక్షిగా లై డిటెక్టర్ టెస్టును ఎదుర్కొనే దమ్మూ, ధైర్యం ఈ పిరికి ముఖ్యమంత్రికి ఉన్నదా అని సవాలు విసిరారు. లై డిటెక్టర్ టెస్టుకు నేను సిద్ధం, నువ్వు సిద్ధమా రేవంత్ రెడ్డి అని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల సాక్షిగా సూటిగా ప్రశ్నించారు.

ఓవైపు మీ దివాళాకోరు విధానాలతో రాష్ట్ర ఖజానా ఖాళీ అని ఓ ముఖ్యమంత్రిగా నిస్సిగ్గుగా మీ అసమర్థతను చాటుకుంటున్న ఈ తరుణంలో విచారణల కోసం ప్రజాధనాన్ని వృధా చేయడం మానుకుని, వెంటనే లై డిటెక్టర్ టెస్టుకు సీఎం రేవంత్ సిద్ధం కావాలన్నారు. లై డిటెక్టర్ పరీక్ష ద్వారా ఎవరు నేరస్తులు తెలంగాణ ప్రజలు తేల్చేందుకు అవకాశం ఇయ్యాలన్నారు కేటీఆర్.

# కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు రాజకీయ కక్ష సాధింపే

**హైదరాబాద్ జూన్ 13(సిద్దిపేట పవర్):**

కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు రాజకీయ కక్ష సాధింపే హైదరాబాద్ : ఫార్ములా ఈ కార్ల రేసింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరోసారి విచారణకు రావాలని నోటీసులు ఇవ్వడం రాజకీయ కక్ష సాధింపే తప్ప మరొకటి కాదు అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు.

తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రేవంత్ రెడ్డి దర్యాప్తు సంస్థలను యథేచ్ఛగా దుర్వినియోగం చేస్తున్నారు అనడానికి కేటీఆర్‌కు ఇచ్చిన తాజా నోటీసులే నిదర్శనం. కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయాలని నిరంతరం ప్రశ్నిస్తున్న కేటీఆర్ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకే రేవంత్ రెడ్డి ఈ నోటీసులు పంపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 18 నెలల పాలనలో డైవర్షన్ పాలిటిక్స్‌ను అమలు చేస్తూ బీఆర్ఎస్‌ను బద్నామ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా రేవంత్ రాజకీయ అరాచకత్వం గెలిచే ప్రసక్తే లేదు. రేవంత్ రెడ్డి డ్రామా, డైవర్షన్ రాజకీయాలు ఇప్పటికే రాష్ట్ర ప్రజలకు అర్థమయ్యాయి అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

ఫార్ములా ఈ రేసింగ్ తో తెలంగాణ ప్రతిష్ట పెరిగింది. పెట్టుబడులు కూడా వచ్చాయి. తెలంగాణ ప్రతిష్ట పెంచినందుకా కేటీఆర్‌పై మీ నోటిసుల ప్రతాపం..? 2000లో చంద్రబాబు ఫార్ములా వన్ కోసం కృషిచేసి నిర్వహించలేకపోయాడు. అలాంటిది బీఆర్ఎస్ ప్రభుత్వం, కేటీఆర్ కృషి వల్ల ఫార్ములా వన్ వంటి ప్రతిష్టాత్మక రేస్‌ను భారతదేశానికి అందులోనూ హైదరాబాద్ కి తీసుకొని వచ్చారు. ఎలక్ట్రిక్ వాహనాల మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా తెలంగాణను మార్చేందుకు ఫార్ములా ఈ రేస్‌ను హైదరాబాద్‌లో నిర్వహించి పెట్టుబడులను ఆకర్షించారు. అమర్ రాజా వంటి కంపెనీలు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చాయని హరీశ్‌రావు గుర్తు చేశారు.



కాంగ్రెస్ ప్రభుత్వం అందాల పోటీలు నిర్వహించి రాష్ట్ర పరువును, దేశ పరువును మంటకలిపింది. అందాల పోటీతో లాభం లేదు కానీ రాష్ట్ర పరువు మాత్రం తీశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపినందుకు, రేవంత్ రెడ్డిని విమర్శిస్తున్నందుకు కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇచ్చిందని స్పష్టమైతున్నది. రేవంత్ రెడ్డి.. నువ్వు ఎన్ని రకాలుగా వేధించినా నీ వైఫల్యాలను ఎండగట్టడం మాత్రం బీఆర్ఎస్ ఆపదు అని హరీశ్‌రావు తేల్చిచెప్పారు

# పురపాలికలను తీవ్రంగా వేధిస్తున్న సిబ్బంది కొరత..

- **వంద రోజుల ప్రణాళిక సాగేనా!**
- **మున్సిపల్ శాఖలో 121 మందికి ప్రమోషన్లు**
- **45 రోజులైనా ఇవ్వని పోస్టింగ్‌లు**

**హైదరాబాద్ జూన్ 13(సిద్దిపేట పవర్):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వంద రోజుల ప్రణాళిక అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఊపందుకోవాల్సిన సమయంలో పరిపాలనలోని లోటుపాట్లు ప్రతిబంధకంగా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా అనేక మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో రెగ్యులర్ మున్సిపల్ కమిషనర్లు లేక ఇన్‌చార్జిలే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

మున్సిపల్ శాఖలో 121 మందికి 45 రోజుల క్రితమే ప్రమోషన్లు కల్పించినా నేటికీ పోస్టింగులు ఇవ్వకపోవడంతో సిబ్బంది కొరత మరింత తీవ్రమైంది. ఈ పరిస్థితుల్లో వంద రోజుల ప్రణాళిక లక్ష్యాలను సాధించడం పెను సవాల్‌గా మారింది. సుస్థిర పట్టణాభివృద్ధి సాధనే లక్ష్యంగా వంద రోజుల ప్రణాళిక అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

'ఒక చర్య ఒక మార్పు' అనే నినాదం, 'ప్రజలే ముందు' అనే విధానం, పరిశుభ్రత ఆరోగ్యమే లక్ష్యంగా ఈ నెల 2 నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 51 అంశాలతో యాక్షన్ ప్లాన్ అమలుచేయనున్నారు. ఎటువంటి విపత్తునైనా ఎదురొనే సామర్థ్యం గల పట్టణాలను రూపొందించడమే ఈ ప్రణాళిక లక్ష్యమని రాష్ట్ర పురపాలక శాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి తెలిపారు.

**వర్షా కాలం వేళ సిబ్బంది కొరత**

వంద రోజుల ప్రణాళికలో భాగంగా మురుగు కాలువలు, నాలాలు, ఓపెన్, భూగర్భ డ్రైనేజీల్లో పూడికతీత పనులు, ముంపు ప్రాంతాల్లో డ్రైనేజీలను శుభ్రం చేయడంతోపాటు మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టనున్నారు. పారిశుద్ధ్య నిర్వహణతోపాటు ప్రజారోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. దివ్యాంగులకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. వన మహోత్సవంలో మొక్కలు నాటనున్నారు. నల్లా కనెక్షన్లు ఆన్‌లైన్‌లో నమోదుచేయడం, కొత్త కనెక్షన్లు ఇవ్వడం, ఇంటి పన్ను, ఆస్తి పన్ను.. ఇలా 51 అంశాలను ఈ ప్రణాళికలో చేర్చారు.

కానీ, సిబ్బంది కొరత లక్ష్య సాధనకు ఆటంకంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ శాఖలో 121 మందికి ప్రమోషన్లు కల్పించింది. ఇందులో గ్రేడ్3లో 56 మంది, గ్రేడ్2లో 42 మంది, గ్రేడ్1లో 12 మంది, సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్లుగా 11 మంది ఉన్నారు. 45 రోజుల క్రితమే వీరికి ప్రమోషన్లు ఇచ్చినా, ఇప్పటివరకు పోస్టింగులు ఇవ్వలేదు. వర్షాకాలం సమీపిస్తున్న వేళ శానిటేషన్ వంటి కీలక విధులు సమర్థంగా నిర్వహించడం కష్టసాధ్యంగా మారుతున్నది. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం పొంచిఉన్నది. శానిటేషన్ ప్రక్రియ సమర్థంగా సాగాలంటే పదోన్నతులు లభించిన వారి సేవలను త్వరితగతిన వినియోగించుకోవాల్సి ఉన్నది.

# కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు.. తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్సీ కవిత

- **ఇది రాజకీయ కక్ష సాధింపేనని తీవ్ర ఆరోపణ**
- **ఎన్ని కుట్రలు పన్నినా వెరవబోమని స్పష్టీకరణ**
- **ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుంచుతామన్న కవిత**

**హైదరాబాద్ జూన్ 13(సిద్దిపేట పవర్):**



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరోసారి నోటీసులు జారీ చేయడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యేనని ఆమె ఆరోపించారు. కేటీఆర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కవిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

"రాజకీయ కక్ష సాధింపులో భాగంగా మా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం మళ్ళీ నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను" అని ఆమె పేర్కొన్నారు. "మీరు ఎన్ని కుట్రలు పన్నినా మీ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతూనే ఉంటాం" అంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఆమె వ్యాఖ్యానించారు.

మరోవైపు, ప్రజా గాయకుడు గద్దర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అవమానించిందని కవిత తీవ్రంగా విమర్శించారు. ప్రతి సందర్భంలోనూ గద్దర్ పేరును ప్రస్తావించే కాంగ్రెస్ ప్రభుత్వం, ఆయన పేరు మీద ఇస్తున్న సినిమా అవార్డుల ఆహ్వాన పత్రికలో గద్దర్ ఫోటోను ముద్రించకపోవడం బాధాకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

"ప్రజా గాయకుడు గద్దర్ గారిని కాంగ్రెస్ ప్రభుత్వం అవమానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. ప్రతి సందర్భంలో గద్దర్ పేరును జపం చేసే కాంగ్రెస్ ప్రభుత్వం, వారి పేరు మీద ఇస్తున్నటువంటి సినీ అవార్డుల ఆహ్వాన పత్రికలో గద్దర్ ఫోటో లేకపోవడం బాధాకరం" అని కవిత పేర్కొన్నారు. కనీసం అవార్డుల పంపిణీ కార్యక్రమంలోనైనా ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి, ఆయనను గౌరవించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గద్దర్ విషయంలో ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని కవిత ఆరోపించారు. ఈ రెండు అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు.

# నా ఎన్నికల్లో అందరూ కష్టపడ్డారు.. రేపు మీ ఎన్నికల్లో కలిసి పని చేసుకోండి..

- **ఖమ్మం జిల్లాలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి తుమ్మల..**
- **నా ఎన్నికల్లో అందరూ కష్టపడి పని చేశారు, రేపు మీ ఎన్నికలు వస్తున్నాయి..**
- **గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది: మంత్రి తుమ్మల**

**హైదరాబాద్ జూన్ 13(సిద్దిపేట పవర్):**



ఖమ్మం జిల్లాలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాల కోసం కామంచికల్ రోడ్ కావాలని సత్యం కోరారు.. ఇందిరమ్మ ప్రభుత్వం రేవంత్ రెడ్డి హయాంలో అన్ని సంక్షేమ పథకాలు అందిస్తుంది.. నా ఎన్నికల్లో అందరూ కష్టపడి పని చేశారు, రేపు మీ ఎన్నికలు వస్తున్నాయని అంతా కలిసి పని చేసుకోండి అని సూచించారు. పాత పథకాలను నడిపిస్తూనే కొత్త పథకాలను అందిస్తున్నాం.. ఇంకా కొన్ని చేయాల్సి ఉంది, తప్పకుండా చేద్దాం మంచి రోజులు వస్తున్నాయి, వర్షాలు ముందే వచ్చాయి.. మీ గ్రామానికి సంబంధించి చాలా అభివృద్ధి కార్యక్రమాలు ఉన్నాయని చేద్దాం అని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

ఇక, మీ ఇండ్లు తాతలు తండ్రులు కట్టినవి, రోడ్డు వెడల్పు కోసం మీ స్థలాలు కొంత పోతాయి అర్థం చేసుకోండి అని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వంకాయలపాటి వెంకయ్య ఊరు ఆయన వెళ్ళేప్పుడు ఏమైనా పట్టుకుని వెళ్ళారా అని చెప్పారు. నేను గ్రామానికి ఒకసారి వస్తా వెళ్తా.. గ్రామాల్లో ఉండేది మీరు శుభ్రంగా ఉంటే ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.. ఆసుపత్రికి వెళ్తే ఒక ఎకరం అమ్మవలసి వస్తుంది, అందుకే పరిశుభ్రంగా ఉండండి.. ప్రజలంతా ఖమ్మంలో ఉంటే మంచిది అనే భావన వచ్చింది.. ముఖ్యమంత్రినీ అడిగి ఇంకా 100 కోట్ల రూపాయలు తెచ్చిన పరిశుభ్రంగా ఉండాల్సిన బాధ్యత మీది అని మంత్రి నాగేశ్వరరావు చెప్పుకొచ్చారు.

# ప్రమాద స్థలంలో బ్లాక్ బాక్స్ లభ్యం..

- **అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాదం**
- **వందల కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపిన ఘటన**
- **టేకాఫ్ అయిన కొన్ని క్షణాలకే కుప్పకూలిన విమానం**
- **తాజాగా ఘటనా స్థలంలో బ్లాక్ బాక్స్ లభ్యం..?**

**అహ్మదాబాద్ జూన్ 13(సిద్దిపేట పవర్):**

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఎయిరిండియా విమాన ప్రమాదం వందల కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపింది. టేకాఫ్ అయిన కొన్ని క్షణాలకే ఈ విమానం కుప్పకూలి మంటల్లో దగ్ధమైంది. తాజాగా.. విమానం కూలిపోయిన ప్రదేశం నుంచి బ్లాక్ బాక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వార్తా సంస్థ రాయిటర్స్ నివేదించింది. ఓ పోలీసు అధికారి వ్యాఖ్యలను ఉటంకిస్తూ వెల్లడించింది. అయితే.. ఈ బ్లాక్ బాక్స్ విమానం ఢీకొట్టిన భవనం పైకప్పుపై లభ్యమైనట్లు తెలిసింది.

కాగా.. ఇప్పటివరకు ఈ ప్రమాదానికి గల కారణమేంటనే దానిపై స్పష్టత రాలేదు. అయినప్పటికీ.. ఈ ఘటనకు సంబంధించి కొన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ విమానం కూలిన తర్వాత ఘటనా స్థలంలో 1000 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో మంటలు చెలరేగినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో సహాయక చర్యలు అత్యంత క్లిష్టంగా మారినట్లు పేర్కొన్నారు.

**బ్లాక్ బాక్స్ అంటే ఏంటి?**

సాధారణంగా విమానాల్లోని బ్లాక్ బాక్స్, కంప్యూటర్ హార్డ్‌డిస్క్ వంటిదని చెప్పుకోవచ్చు. విమానంలో జరిగే ప్రతి విషయాన్ని ఇది రికార్డ్ చేసుకుంటుంది. కేవలం కాక్‌పిట్‌లోని సంభాషణలే కాకుండా రేడియో ట్రాఫిక్, సిబ్బందితో జరిపే చర్చలు, పైలట్ల అనౌన్స్‌మెంట్, పైలట్లు ప్రైవేట్‌గా జరిపే సంభాషణలను సైతం రికార్డ్ చేస్తుంది. విమాన వేగం, ఎత్తు, ఇంజిన్ థ్రస్ట్ మొదలైన విమాన డేటాను అందిస్తుంది. విమానం బయలు దేరినప్పటి నుంచి ల్యాండ్ అయ్యేదాక ప్రతీది ఇందులో రికార్డ్ అవుతుంది.






# తెలంగాణలో 28 బార్లకు లాటరీ ప్రక్రియ పూర్తి..

- **జీహెచ్ఎంసీ పరిధిలో అధిక స్పందన**
- **జీహెచ్ఎంసీలో 24 బార్లకు 3,520 దరఖాస్తులు**
- **లాటరీ ద్వారా రూ.36.68 కోట్ల ఆదాయం**
- **అధికంగా విజయం సాధించిన హైదరాబాద్, నల్గొండ అభ్యర్థులు**

**హైదరాబాద్ జూన్ 13(సిద్దిపేట పవర్):**

తెలంగాణ రాష్ట్రంలో 28 కొత్త బార్లకు గాను ఈరోజు ఆబ్కారీ శాఖ లాటరీ పద్ధతిలో లబ్దిదారులను ఎంపిక చేసింది. ఈ లాటరీ ప్రక్రియ శుక్రవారం నార్సింగ్‌లోని ది అడ్రస్ కన్వెన్షన్స్ అండ్ ఎగ్జిబిషన్ హాల్లో ప్రశాంతంగా ముగిసింది. ఈ కార్యక్రమాన్ని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ నేతృత్వంలో నిర్వహించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని 24 బార్లకు 3,520 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోని నాలుగు బార్లకు మరో 148 దరఖాస్తులు అందాయి. మొత్తం 28 బార్లకు 3,668 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు వెల్లడించారు.

ఈ లాటరీ ప్రక్రియ ద్వారా రాష్ట్ర ఎక్సైజ్ శాఖకు రూ.36.68 కోట్ల ఆదాయం లభించింది. లాటరీలో హైదరాబాద్, నల్గొండ జిల్లాలకు చెందిన అభ్యర్థులే ఎక్కువగా విజయవంతం అయినట్టు తెలుస్తోంది. కొంతమంది అభ్యర్థులు రెండు బార్లకు దరఖాస్తు చేయగా, ఒక్క దానికి ఎంపిక కావడం గమనార్హం. మరోవైపు, 148 దరఖాస్తులు చేసిన వ్యక్తికి కేవలం ఒక్క బార్ మాత్రమే దక్కడం విశేషం. కార్యక్రమానికి ముందు అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మరణించినవారికి రెండు నిమిషాల మౌనం పాటిస్తూ నివాళులు అర్పించారు. కార్యక్రమం మొత్తం సజావుగా, పారదర్శకంగా ముగిసిందని అధికారులు తెలిపారు.



# కేంద్రం ఉగ్రవాదులతో కాల్పుల విరమణ చేసుకుంది.. మావోయిస్టులతో చర్చలకు వస్తలేదు..


- **ఎడ్ల గురువా రెడ్డి14వ వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని..**

**హైదరాబాద్ జూన్ 13(సిద్దిపేట పవర్):**

విమాన ప్రమాదంలో మాజీ సీఎం విజయ్ రూపానీ మరణించడం దురదృష్టకరం: కూనంనేని

సిద్దిపేట మాజీ ఎమ్మెల్యే ఎడ్ల గురువా రెడ్డి 14 వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులతో చర్చలు నడిపేందుకు సిద్ధంగా ఉంది.. కానీ నక్సలైట్స్ తో చర్చలకి ముందుకు రావడం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టులను ఉగ్రవాదుల కంటే దారుణంగా మోడీ సర్కార్ చూస్తుందని విమర్శలు గుప్పించారు.

ఇక, కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టులో ఇంజనీర్స్ దే పాత్ర ఉందని తమకు ఏం తెలియదని అనడం సరికాదు అని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. కేసీఆర్ సంపన్నమైన రాష్ట్రాన్ని కాళేశ్వరం కట్టి అప్పుల రాష్ట్రంగా మార్చారు అని ఆరోపించారు. అలాగే, ఎయిర్ ఇండియా ప్రమాదంలో మరణించిన వారికి సంతాపం తెలుపుతున్నాం.. ఈ ప్రమాద ఘటనపై కేంద్రం ఫెయిల్ అయింది.. మాజీ ముఖ్యమంత్రి ప్రమాదంలో మరణించడం దురదృష్టకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తీర్చలేక కుంగిపోతోంది.. బీఆర్ఎస్ చేసిన తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం చేయవద్దు అని కూనంనేని సూచించారు.





# యాదవులను మోసం చేసిన మాజీ మంత్రి ,ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు

- చనిపోయిన ఒక్క గొర్రెకు అయినా ఇన్సూరెన్స్ ఇచ్చారా
- యాదవులు గొర్రెల కోసం కట్టిన డిడిలు వాడుకున్నది మీరు కాదా
- ఇతర కులాలకు ఏసీ ఫంక్షన్ హాల్లు యాదవులకు మాత్రం రేకుల షెడ్ల

**చిన్నకోడూర్ ,జూన్13 (సిద్దిపేట పవర్):** గత ఇరవై ఏండ్లు గా సిద్దిపేట నియోజకవర్గనీకి ప్రాతినిధ్యం వహిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు యాదవులను మోసం చేస్తూ నట్టేట ముంచారని. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మీసం. మహేందర్ యాదవ్ మండపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిన్న సిద్దిపేట నియోజకవర్గ శ్రీకృష్ణ యాదవ్ ఫంక్షన్ హాల్ లో పాలకవర్గం ఏర్పాటు చేసిన పదవ తరగతి లో ప్రతిభ చూపిన విద్యార్థుల సత్కార కార్యక్రమానికి హాజరైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం గొర్రెల డీడీలు వాపస్ ఇచ్చి యాదవుల ను మోసం చేసిందని మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. అంతే కాకుండా గత 20 ఏళ్లుగా సిద్దిపేట నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మాజీ మంత్రి ,ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు .రెండుసార్లు మంత్రిగా కొనసాగి యాదవుల ఓట్లు దండుకొని యాదవులకు మాత్రం కనీసం ఒక కౌన్సిలర్ టికెట్ అయినా లేదా ఒక జెడ్పిటిసి టికెట్ అయినా ఇవ్వకుండా యాదవులను మోసం చేసింది కాదఅని ప్రశ్నించారు.గత మీ ప్రభుత్వ హయాంలో యాదవులు విద్యావంతులైతే ఎదురు తిరిగి ప్రశ్నిస్తారనే ఉద్దేశంతో యాదవులు గొర్రెలు కాసుకొని బ్రతకాలని ప్రతి యాదవ సభ్యుల నుండి డిడి ల పేరుతో ఒక్కో డి డి కి సుమారు 35 వేల రూపాయలు కట్టించుకుని గొర్రెల రీసైక్లింగ్ పేరుతో యాదవుల పేరుతో దళారులు, మీ బిఆర్ఎస్ నాయకులు కోట్ల రూపాయలు దండుకున్నారు తప్ప యాదవులకు మాత్రం ఒరిగిందేమీ లేదన్నారు. చనిపోయిన ప్రతి గొర్రెకు ఇన్సూరెన్స్ కల్పిస్తామని చెప్పిన గత బిఆర్ ఎస్ ప్రభుత్వం ఒక్క గొర్రె కైనా ఇన్సూరెన్స్ ఇచ్చారని నిలదీశారు. నియోజకవర్గంలో కొన్ని కులాలకు ఏసీ ఫంక్షనల్ నిర్మించి ఇచ్చారని యాదవులకు మాత్రం రేకుల షెడ్లే దిక్కు అయినాయి అన్నారు.బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డి డి లు కట్టించుకొని వాటిని పక్క దారిపట్టించి గొర్రెలు ఇవ్వక మోసం చేసి అడ్డగోలుగా అవినీతి కి పాల్పడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే యాదవులపై చిత్త శుద్ధి తో గొర్రెల స్కిం పై జరిగిన అవినీతి విచారణ కు ఆదేశించి డిడి లు వాపస్ ఇప్పించి యాదవులను ఆదుకుదాన్నారు ఇప్పటికైనా తన అబద్దాలతో కాంగ్రెస్ ప్రభుత్వం పై బురద జల్లుడు రాజకీయాలు మానుకొని నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు సందబోయిన పరశురాం యాదవ్, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు జయంత్ యాదవ్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ పొన్నాల రాజేష్, మండల కన్వీనర్ కొమ్ము ప్రశాంత్, ఎస్సీ సెల్ మండల మాజీ అధ్యక్షులు నముండ్ల వినోద్, ఎగుర్ల.రాములు, కర్రె.మధు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పల్లా త్వరగా కోలుకోవాలని కొండపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు .

**కొమురవెల్లి:**

ఎర్రవల్లి కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో గాయపడి సోమాజిగూడ లోని యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న జనగామ శాసన సభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి త్వరగా కోలుకోవాలని కొండపోచమ్మ ఆలయంలో అభిమానులు ముడుపు కట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు అమ్మవారి కృపతో త్వరగా కోలుకోవాలని ప్రజాక్షేత్రంలోకి వచ్చి మరెందరికో తోడ్పాటు అందిస్తూ ధైర్యాన్ని కలిపిస్తూ మరెన్నో కార్యక్రమాలు లో భాగస్వామ్యం కావాలని నాయకులు కోరుకుంటున్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బుడిగె గురవయ్య గౌడ్ మకిలి కనకయ్య, రమేష్ గౌడ్ గ్రామ శాఖ అధ్యక్షులు బచ్చల పరశురాములు యూత్ అధ్యక్షులు



ఉప్పరి సతీష్ మైనార్టీ మండల అధ్యక్షుడు హర్షద్ బుడిగే రమేష్ దర్శనం తుక్కోజి కిషన్ , తుక్కోజి అనిల్, మకిలి నవీన్ , కరుణాకర్ పాల్గొన్నారు.



# చేర్యాల నుంచి యాదగిరి గుట్ట వరకు పాదయాత్ర

**ఎమ్మెల్యే పల్లా త్వరగా కోలుకోవాలని పాదయాత్ర చేపట్టిన చేర్యాల పట్టనానికి చెందిన భూమిగారి రాజేందర్**

**చేర్యాల, జూన్ 13 (సిద్దిపేట పవర్)** సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణం నుంచి యాదగిరి గుట్ట వరకు పాదయాత్ర చేపట్టారు పల్లా రాజేశ్వర్ రెడ్డి అభిమానులు, అనుచరులు.. ఇటీవల ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రం లో గాయపడి సోమాజిగూడ యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి త్వరగా కోలుకోవాలన్న కోరికతో ఈ పాదయాత్ర ప్రారంభించారు.వైద్యుల పర్యవేక్షణలో ఉన్న ఎమ్మెల్యే ఆరోగ్యం త్వరగా మెరుగవ్వాలని వారు లక్ష్మి నర్సింహా స్వామి వారికి రేపు మొక్కులు చెల్లించనున్నారు పాదయాత్ర చేసేవారిలో చేర్యాల పట్టణానికి చెందిన మూడో వార్డు బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడుభూమిగారి రాజేందర్, వారితో పాటు భూమిగారి విజయ్, పుట్ట యశ్వంత్, కల్లాటి విశ్వతేజ ఉన్నారు








# భారతీయ యోగ ప్రపంచానికి ఆదర్శం

- సాధనతో సంపూర్ణ ఆరోగ్యం
- సిద్దిపేట జిల్లా డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ రేవతి
- నర్సింగ్ కళాశాలలో ఉచిత యోగ తరగతులు ప్రారంభం

**సిద్దిపేట జూన్ 13**

భారతీయ అపూర్వ వైద్య సంపద యోగ వైపు ప్రపంచమంతా దృష్టి సారిస్తుంటే మనము పాశ్చాత్య సంస్కృతి వైపు చూస్తూ అనారోగ్యాలకు దగ్గరవుతున్నామని సిద్దిపేట జిల్లా డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ రేవతి అన్నారు. సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ , వ్యాస మహర్షి యోగ సొసైటీ , భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ల ఆధ్వర్యంలో శుక్రవారం సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఉచిత యోగ శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రకరకాల కాలుష్యాల వల్ల అనారోగ్యాలు పెరిగిపోతున్నాయని చెప్పారు. చికిత్సలు , మందులతో పాటు యోగాతో కూడా ఎన్నో వ్యాధులను నయం చేయవచ్చునని చెప్పారు .యోగ విద్యను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ప్రపంచానికి భారతీయ యోగా ఆదర్శంగా మారుతుందని చెప్పారు. భవిష్యత్తులో నర్సింగ్ విద్యార్థులు రోగులకు సేవ చేసే సమయంలో యోగాను కూడా వినియోగిస్తే అద్భుత ఫలితాలు ఉంటాయని చెప్పారు. ముఖ్యంగా మహిళలు ఆపరేషన్లు కాకుండా సుఖ ప్రసవాలు కావడానికి అవసరమైన ప్రత్యేక యోగా శిక్షణను పొందాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు తోట అశోక్ మాట్లాడుతూ జూన్ 21 న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయడంలో భాగంగా సిద్దిపేటలో వివిధ ప్రాంతాల్లో ఉచిత యోగ శిక్షణ తరగతులు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతిరోజు అరగంట సమయం యోగా కోసం వినియోగిస్తే గంటల తరబడి , రోజుల తరబడి ఆసుపత్రుల వద్ద ఎదురు చూస్తూ కష్టనష్టాలను , వ్యయ ప్రయాసలను భరించే దుస్థితి రాదని చెప్పారు. విద్యార్థులు నర్సింగ్ కోర్స్ తో పాటు యోగ సర్టిఫికెట్ కోర్స్ పొందితే ఉద్యోగాలు సులభంగా లభిస్తాయని చెప్పారు. బంధుమిత్రులకు యోగ విద్యను అందించడం చక్కటి బహుమతి అవుతుందన్నారు. మున్సిపల్ కౌన్సిలర్ దీప్తి నాగరాజు మాట్లాడుతూ గడపగడపకు కౌన్సిలర్ పథకాన్ని తీసుకువెళుతున్నట్టుగా యోగ విద్యను కూడా ప్రజలకు అందిస్తామని చెప్పారు. సంపూర్ణ ఆరోగ్యమే అద్భుతమైన సంపదని చెప్పారు. వివిధ రకాల సమస్యలకు యోగా చక్కటి పరిష్కారం అని అన్నారు. ప్రెస్ అకాడమీ పూర్వ సభ్యులు కే. అంజయ్య మాట్లాడుతూ మానసిక , శారీరక వికాసానికి యోగ విద్య పునాదిగా మారుతుందని అన్నారు. జాతీయ యోగాసన జడ్జి తోట సంధ్య మాట్లాడుతూ యోగ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎవరు దృఢంగా ఉంటారో వారు అద్భుతంగా సేవలు అందిస్తారని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శిభా , వైస్ ప్రిన్సిపల్ విజయ కుమారి , లెక్చరర్ సుప్రియ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అనూష తో పాటు లెక్చరర్ లు , సిబ్బంది , విద్యార్థులు పాల్గొన్నారు.

# సిద్దిపేట..... అభివృద్ధికి కృషి చేస్తా .

- ఉమ్మడి మెదక్ జిల్లా నూతన ఇన్చార్జి మంత్రి వివేక్ నియామకం
- ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించాలి
- ప్రజల కష్టాలు తీర్చడమే కాంగ్రెస్ లక్ష్యం
- పార్టీ అభివృద్ధికి నాయకులు పనిచేయాలి
- మంత్రి వివేక్ వెంకటస్వామినీ కలిసిన పూజల హరికృష్ణ

**సిద్దిపేట పవర్ సిద్దిపేట న్యూస్:**

సిద్దిపేట అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఉమ్మడి మెదక్ జిల్లా నూతన ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. రాష్ట్ర కార్మిక భూగర్భ గనుల శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రిగా నియమితులైనందుకు సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ శుక్రవారం హైదరాబాదులోని తన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనకు



శాలువ తో సన్మానం చేశాడు. సిద్దిపేట సమస్యలు అభివృద్ధి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ సిద్దిపేట అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు నాయకులు కష్టపడి పని చేయాలని అన్నారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని అన్నారు.

# తెలంగాణను కేసీఆర్ అప్పులమయంగా మార్చారు: కూనంనేని

**సిద్దిపేట పవర్:**

సిద్దిపేట జిల్లా: సంపన్నమైన తెలంగాణ రాష్ట్రాన్ని కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టి అప్పుల రాష్ట్రంగా మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్చారని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. తెలంగాణలో కాళేశ్వరంపై విచారణ జరుగుతోందని అన్నారు. కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో ఇంజనీర్‌దే పాత్ర ఉందని తమకు ఏం తెలియదని అనడం సరికాదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తీర్చలేక కుంగిపోతోందని విమర్శించారు కూనంనేని సాంబశివరావు.



సిద్దిపేట మాజీ ఎమ్మెల్యే ఎడ్ల గురువారెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మీడియాతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా చాలా అంశాలపై చర్చ జరుగుతోందని చెప్పుకొచ్చారు. ప్రజలకు హామీలు నెరవేరుస్తామని పార్టీలు మభ్య పెట్టవద్దని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతు భరోసా, రుణమాఫీ పూర్తిగా ఇచ్చినట్లు చెబుతూ చేతులు ఎత్తేస్తున్నారని మండిపడ్డారు. జర్నలిస్ట్‌ల కోసం ప్రభుత్వం ప్రత్యేక పాలసీని ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ చేసిన తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం చేయొద్దని కూనంనేని సాంబశివరావు కోరారు. ఎయిర్ ఇండియా ప్రమాదంలో మరణించిన వారికి సంతాపం తెలిపారు. ఈ ప్రమాద ఘటనపై కేంద్రం ప్రభుత్వం పెయిల్ అయిందని విమర్శించారు. మాజీ సీఎం ఈ ప్రమాదంలో మరణించడం దురదృష్టకరమని అన్నారు. ఆర్థికంగా జర్మనీని దాటినట్లు చెబుతూ కేంద్రం అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను మభ్య పెడుతోందని ధ్వజమెత్తారు. అనేక మంది చాలీచాలని జీతాలతో అర్ధాకలితో చాలామంది ఉన్నారని చెప్పారు కూనంనేని సాంబశివరావు. విద్య, వైద్యపరంగా మనం 126వ స్థానంలో ఉన్నామని కూనంనేని సాంబశివరావు వివరించారు. ప్రజలను చైతన్యం చేయడంలో సీపీఐ తన కర్తవ్యాన్ని నిర్వహిస్తోందని ఉద్ఘాటించారు. డిసెంబర్ 26వ తేదీన ఖమ్మంలో శతాబ్ది ఉత్సవాలను 5లక్షల మందితో నిర్వహిస్తామని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులతో చర్చల కోసం సిద్ధంగా ఉన్నది కానీ నక్సలైట్లతో చర్చలకి ఎందుకు ముందుకు రావడం లేదని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రశ్నల వర్షం కురిపించారు.



# ఘనంగా మాజీ ఎఫ్ డి సి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి జన్మదిన వేడుకలు



**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** జగదేవపూర్ మండల కేంద్రంలోని మాజీ ఎఫ్ డి సి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి జన్మదిన సందర్భంగా మండల టిఆర్ఎస్ నాయకులు స్థానిక ఎల్లమ్మ దేవాలయం లో ఆయన పేరు మీద ప్రత్యేక పూజలు చేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ మాజీ ఎఫ్ డి సి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి గజ్వేల్ నియోజకవర్గ ప్రజల సుపరిచితుడు ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉండే నాయకుడని అన్నారు. ఆయన అష్ట ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని టిఆర్ఎస్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ గుండా రంగారెడ్డి మాజీ ఎంపీపీ బాలశంగౌడ్ పిఎసిఎస్ చైర్మన్ ఆలేటి ఇంద్రసేనారెడ్డి గజ్వేల్ ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రాచమల్ల ఉపేందర్ రెడ్డి మాజీ సర్పంచ్లు రావికంటి చంద్రశేఖర్ అంకిల్ల యాదవ రెడ్డి బట్టు సుధాకర్ రెడ్డి రాజేశ్వరి రవి బాలలక్ష్మి ఐలయ్య అంజిరెడ్డి పిట్టల రాజు మాజీ ఎంపిటిసిలు కారింగుల కిరణ్ గౌడ్ కొత్త కవిత శ్రీనివాస్ రెడ్డి మాజీ ఉపసర్పంచ్లు తివుల బాలకిషన్ టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బుద్ధ నాగరాజు చిలుకూరి మధుసూదన్ రెడ్డి దాచారం కనకయ్య బాలకిషన్ మచ్చ గణేష్ అచ్చ బాబు మల్లేశం బాలకృష్ణ జూపల్లి బంగారి కేశమైన మహేందర్ యాదవ్ జురు ఐలయ్య మంత్రి సత్యనారాయణ స్వామి బచ్చలి భాస్కర్ హలీం ఆంజనేయులు మల్లేశం శ్రీనివాస్ రెడ్డి టిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మాజీ ముఖ్యమంత్రి ఆశీస్సులు తీసుకున్న వంటేరు ప్రతాప్ రెడ్డి

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం:**

గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి తన జన్మదిన సందర్భంగా తెలంగాణ సాధకులు, అభివృద్ధి ప్రధాత, రైతు బాంధవుడు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుని కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు.






# నా టీం లో అటువంటి వ్యసనపరులకు స్థానం లేదు




- **యువ విద్యార్థి ఆత్మీయ సమ్మేళనం లో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**
- **మీరు నేను ఒక కుటుంబం...**
- **మీరంతా నా ఆత్మీయ తమ్ముళ్లు...**
- **బి ఆర్ ఎస్ పార్టీ ఆవిర్భావ రజతొత్సవ సందర్బంగా పాదయాత్ర చేసిన యువ విద్యార్థులను సన్మానించిన హరీష్ రావు**

**సిద్దిపేట పవర్ సిద్దిపేట జూన్ 13**

మీరు నేను ఒక కుటుంబం, మీరంతా నా ఆత్మీయ తమ్ముళ్లు అని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు.గులాబీ జెండా కోసం మి పటిమ.. పట్టుదలను నా గుండెల్లో పెట్టుకుంటా అని తెలిపారు. సిద్ధిపేటలో గురువారం రాత్రి జరిగిన యువ విద్యార్థి ఆత్మీయ సమ్మేళనం లో పాల్గొని మాట్లాడారు. సిద్ధిపేటలో పుట్టిన గులాబీ జెండా రజతోత్సవం జరుపుకుందన్నారు .రజతోత్సవానికి ప్రత్యేకంగా నిలువడానికి సిద్ధిపేట నుండి వరంగల్ వరకు పాదయాత్రగా వచ్చిన మీ అందరికి పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు .ఇంత సుదీర్ఘ పాదయాత్ర ను ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి విజయవంతం చేసిన మీకు ఎం చేసిన తక్కువే అని యువత వ్యసనాలకు బానిస అవ్వొద్ద నీ తల్లిదండ్రులకు అండగా నిలవాలని కోరారు. ప్రతి ఒక్కరు లైఫ్ లో సెటిల్ అయ్యి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని సూచించారు. ప్రతి మనిషిజీవితానికి దశ దిశను నిర్ధారించేవయస్సు 2550 ఏళ్ల మధ్య కాలం అని,ఈ సమయంలో ఎంత సమయం కష్టపడ్డావ్ అనేది బేరీజు వేసుకొని ప్రతి నిమిషం కష్టపడాలి అన్నారు.ఆన్లైన్ గేమ్స్ తో యువత జీవితాలు నాశనం చేసుకుంటుంది. యువత ఈ బెట్టింగ్ భూతానికి దూరంగా ఉండాలని కోరారు.పని చిన్నదా పెద్దదా అనేది ముఖ్యం కాదు.. ఎదో ఒక పని చేసి ముందు స్థిరపడండి. సమయం చాలా విలువైనది. ఏ వయస్సులో చెయ్యాల్సింది ఆ వయసులోనే చెయ్యాలన్నారు. పోయిన సమయం తిరిగి రాదని, ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకొని జీవితంలో ముందుకు సాగాలని,మీలో ప్రతి ఒక్కరు ఒక్కో నాయకుడు కావాలన్నారు. అందుకు నా వంతుగా ఎం చెయ్యాలో అది చేస్తా,మద్యం,డ్రగ్స్ వ్యసనాలకు తావు ఇవ్వకండి అని తెలిపారు. నా టీం లో అటువంటి వ్యసన పరులకు స్థానం లేదని, ఇంకో మూడేళ్ళలో వచ్చేది మళ్ళి మన బిఆర్ఎస్ ప్రభుత్వమే అని తెలిపారు.రేవంత్ పాలనలో ఏ ఒక్క స్కీం కూడా అమలు కావడం లేదని,రైతులను, ఉద్యోగులను, విద్యార్థులను, వృద్ధులను, యువతను అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నాడు అన్నారు. ప్రజలకు పాలు ఏందో నీళ్లు ఏందో అర్థం అయ్యింది. వాళ్లే ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు అని తెలిపారు



# ప్రతాప్ రెడ్డి జన్మదిన సందర్భంగా టీవీ డొనేట్ చేసిన మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్ గుప్త

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :**

జగదేవపూర్ మండలం ఇటిక్యాల గ్రామంలో ప్రాథమిక కొన్నత పాఠశాలలో మాజీ ఎఫ్ డి సి చైర్మన్ వందర్ ప్రతాప్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఇటిక్యాల గ్రామ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్ గుప్తా విద్యార్థులకు టీవీ డిన్నర్ చేశారు. అదేవిధంగా విద్యార్థులకు మాజీ గ్రామ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్ గుప్తా మాజీ ఎంపీపీ బాలేశం గౌడ్ పిఎసిఎస్ చైర్మన్ ఆల్ట్ ఇంద్రసేనారెడ్డి గజల్ ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రాచమల్ల ఉపేందర్ రెడ్డి మచ్చ గణేష్ చేతుల మీదుగా అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ రాష్ట్ర ఎఫ్ డి సి చైర్మన్ వందర్ ప్రతాప్ రెడ్డి జన్మదినం మరెన్నో జరుపుకోవాలని గజ్వేల్ ప్రజలకు సుపరిచితుడు గజ్వేల్ ప్రజల వెన్నుదండు ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ రాజకీయాల్లో తనదైన శైలి ముద్ర వేస్తూ అన్నా అంటే నేనున్నానని పలికే నాయకుడు ప్రతాప్ రెడ్డి అని కొనియాడారు. ఆయన అష్ట ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆ భగవంతుని కోరుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంకిల్ల యాదిరెడ్డి జగదేవపూర్ గ్రామ బీ ఆర్ ఎస్ శాఖ అధ్యక్షుడు బుద్ధ నాగరాజు చిలుకూరి మధుసూదన్ రెడ్డి పాఠశాల చైర్మన్ కర్కపట్ల రాజు జుర్రు ఐలయ్య బాలకృష్ణ బత్తిని శ్రీనివాస్ ఎండి అలీమ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు టిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# రామంచలో బ్రాహ్మణోత్తంలచే సామూహిక అక్షరాభ్యాసం

**సిద్దిపేట పవర్ చిన్న కోడూరు జూన్,13:**

చిన్న కోడూరు మండలంలోని రామంచ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని పూజారి ప్రవీణ్ పంతులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి 10 మంది విద్యార్థులచే తల్లిదండ్రుల సమక్షంలో అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాల పక్షాన విద్యార్థులకు పలకలు అందజేసి, మిఠాయిలు పంపించేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్లా షరీఫ్, అమ్మ కమిటీ చైర్మన్ ప్రేమలత, భారతమ్మ, ఉపాధ్యాయులు సురేష్ కుమార్, వర ప్రసాద్, యాదయ్య, లలిత, సునీత, నాగమణి, వాణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.






# ఘనంగా మాజీ ఎఫ్డీసీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి జన్మదిన వేడుకలు

**జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్:13**
బిఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్, మాజీ ఎఫ్డీసీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి జన్మదినం సందర్భంగా గజ్వేల్ పట్టణం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గజ్వేల్ బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకోవడం జరిగింది. అనంతరం ఇందిరాపార్క్ చౌరస్తా వద్ద కొండ పోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ గోలి సంతోష్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రజా నాయకుడు గజ్వేల్ ముద్దుబిడ్డ వంటేరు ప్రతాప్ రెడ్డి ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని ఆ భగవంతున్ని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ ఎన్.సి రాజమౌళి, తాజా మాజీ వైస్ చైర్మన్ జఖీయుద్దిన్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నమాజ్ మీరా, యువజన అధ్యక్షుడు గడియారం స్వామి చారి,ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఉడెం కృష్ణారెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ జేజేల వెంకట్ గౌడ్, రాష్ట్ర నాయకులు ఖాజా విరాసత్ అలీ, హైదర్ పటేల్, దుర్గాప్రసాద్, అత్తెల్లి శ్రీనివాస్, అల్వాల బాలేష్, మల్లేశం, రహీం, పంబాల శివ, అహ్మద్, వాజిద్, రఘుపతి రెడ్డి, రవీందర్ రెడ్డి, నరేష్ యాదవ్ బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# విద్య ద్వారానే సమాజంలో ఉన్నత విలువ

**ఎస్ ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** పేద ధనిక తేడా లేకుండా సమాజంలో ఉన్నత విలువ గౌరవం విద్య ద్వారానే సాధ్యమవుతుందని సోషల్ రిఫార్మేషన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజా సేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ అన్నారు.శుక్రవారం రాయపోల్ మండల కేంద్రం, కృష్ణసాగర్ గ్రామాలలో ఎస్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ కోసం డిగ్రీ కళాశాల అధ్యాపకులు డా. కొరివి వినయ కళ, డా. ఆర్. సుహాసిని లతో కలిసి గోడపత్రిక ఆవిష్కరించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో పేదరికం అసమానతలు తొలగిపోవడానికి విద్య ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి గురుకులాలలో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తుందని, ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని సామాజికంగా, ఆర్థికంగా, ఎదగడానికి ఉపయోగించుకోవాలని కోరారు. జ్ఞానమే సమాజంలో మన స్థాయిని నిర్ణయిస్తుందని, జ్ఞానాన్ని అర్జించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న విద్య అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు కూడా దక్కుతాయని పేర్కొన్నారు. యువత అనేక చెడు వ్యసనాలకు బానిసలుగా మారి భవిష్యత్తును వృధా చేసుకుంటున్నారని,వాటన్నింటి నిర్మూలనకు విద్యనే సరైన ఔషధమని పేర్కొన్నారు. విద్య ద్వారా మంచి చెడుల విచక్షణ తెలుస్తుందని తద్వారా సమాజంలో జీవించడానికి అవసరమైన మౌలిక విషయాలను అవగాహన చేసుకోవడానికి తోడ్పడుతుందన్నారు. సమాజ మార్పుకు నాంది పలికిన బుద్ధుడు, పూలే, అంబేద్కర్ లు విద్య ద్వారా మాత్రమే ప్రపంచ చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. కావున ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్య మరియు సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని, గ్రామీణ ప్రాంత విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని సూచించారు. గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించి అడ్మిషన్ ప్రక్రియ పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో రాయపోల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పుట్ట రాజు, జర్నలిస్ట్ మన్నె గణేష్,గౌరిగారి పర్ష రాములు, మహమ్మద్ సాజీద్, తుడుం ఇంద్రకరణ్, రాంపల్లి సతీష్, తుడుం ప్రశాంత్, నవీన్, యాదగిరి, కనకయ్య, అజయ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



# అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దు రాజగోపాల్పేట ఎస్సై ఆసిఫ్

- **విద్యార్థి దశలో క్రమశిక్షణ చాలా ముఖ్యం**
- **సోషల్ మీడియాకు దూరం ఉంటే మంచిది**
- **సెల్ ఫోన్ అవసరం మేరకు మాత్రమే ఉపయోగించాలి**



**సిద్ధిపేట పవర్ నంగునూరు, జూన్ 13**
చదువుకునే వయసులో విద్యార్థులు చెడు అలవాట్లకు బానిస కావద్దని రాజగోపాల్ పేట ఎస్సై ఎం.డి.ఆసిఫ్ సూచించారు. రాజగోపాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలు, షీటీమ్ నిర్వహిస్తున్న విధులు, షీటీమ్ ద్వారా రక్షణ, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, నూతన చట్టాలు, అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ పై శుక్రవారం అవగాహన కల్పించారు. సందర్భంగా ఎస్సై ఆసిఫ్ మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రమశిక్షణ ముఖ్యమన్నారు. అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దన్నారు.,సోషల్ మీడియాకు దూరం ఉంటే భవిష్యత్ మంచిగా ఉంటుందని తెలిపారు. చదువుకునే సమయములో చెడు అలవాట్లకు బానిస కావద్దని అన్నారు. ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. చదువుకోవడం వలన భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని చెప్పారు. పిల్లలను చదివించటానికి తల్లిదండ్రులు చేస్తున్న కష్టాన్ని మనసులో పెట్టుకొని చదువుపై శ్రద్ధ వహించాలని సూచించారు. సెల్ ఫోన్ nu అవసరం మేరకే ఉపయోగించాలన్నారు. సెల్ ఫోన్ వల్ల ఎంత మంచి ఉందో అంత చెడు ఉందని, దానికి అలవాటు పడి బానిసలు కావద్దని చెప్పారు. విద్యార్థి దశ కీలకమని, ఈ దశలో కష్టపడి చదువుకోవడం చాలా ముఖ్యమని తెలిపారు. మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేసినా, అవహేళనగా మాట్లాడినా వెంటనే డయల్ 100 కు గానీ, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ షీటీమ్ నెంబర్ 8712667434 నెంబర్ కు గానీ ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో రాజగోపాలపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.కనకయ్య, సిద్దిపేట షీటీమ్ బృందం ఏఎస్ఐ కిషన్, కానిస్టేబుళ్లు మమత, శిరీష, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు విద్యార్థినీ



# పిడుగుపాటుకు 11 మేకల మృతి

**సిద్దిపేట పవర్ నంగునూరు జూన్ 13:**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గణపురం గ్రామంలో శుక్రవారం పిడుగు పడి 11 మేకలు చనిపోయాయి. శుక్రవారం ఉదయం మేకలను మేతకు తీసుకు వెళ్లారు. వర్షం పడుతుండడంతో మేకలను గ్రామంలోని మామిడి తోటలోకి తోలుకెళ్లి చెట్ల కింద తడవకుండా ఉన్నారు. వర్షంతో పాటు పిడుగు పడడంతో 11 మేకలు చనిపోయాయి. గ్రామానికి చెందిన లింగం పల్లి కొమురయ్యకు చెందిన నాలుగు మేకలు, ఏలేటి లక్ష్మారెడ్డికి చెందిన ఏడు మేకలు మృతి చెందాయి. విషయం తెలుసుకున్న మండల రెవెన్యూ ఇనస్పెక్టర్(గిర్ధావర్) పయ్యావుల లింగం సంఘటనా స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు.

# భూభారతి చట్టం ద్వారా భూ సమస్యల పరిష్కారం తహసిల్దార్ సరిత



**సిద్ధిపేట పవర్ నంగునూరు, జూన్ 13:**
భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని నంగునూరు తహసీల్దార్ జి.సరిత తెలిపారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం సిద్ధన్నపేట గ్రామంలో శుక్రవారం భూభారతి చట్టం అమలులో భాగంగా రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సదస్సులో తహసీల్దార్ సరిత మాట్లాడుతూ రెవెన్యూ సంబంధమైన సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుల నుంచి రెవెన్యూ ఇన్స్పెక్టర్ (గిర్దావర్ 2) జయ సూర్య, జూనియర్ సహాయకుడు మహేందర్, రికార్డ్ సహాయకురాలు భవాని, చైన్ మ్యాన్ రమేశ్, వీఆర్ఏ రాజు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా 84 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బంగారు నరసింహులు, పంగ రాజశేఖర్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకుడు కందికట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.